క్లుప్తంగా

అన్నదానానికి విరాళాలు



దాతలకు స్వామి చిత్రపటం అందజేస్తున్న సిబ్బంది

కొత్తపేట: ఆత్రేయపురం మండలం ర్యాలి జగన్మోహినీ కేశవగోపాలస్వామి ఆలయం అన్నప్రసాద పథకానికి భక్తులు విరివిగా విరాళాలు అందజేస్తున్నారు. అమెరికాలో స్థిరపడిన చుండి వెంకట్–నాగకళ్యాణి దంపతుల కుమార్తె నాగహర్షిణి అన్నప్రసాద పథకానికి శుక్రవారం రూ.50,116 విరాళంగా సమర్పించారు. దాతలకు దేవస్థానం తరఫున అధికారులు, వేదపండితులతో ఆశీర్వచనం చేయించి, స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించి, స్వామివారి చిత్రపటాలను అందచేశారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి అంబాజీపేట మండలం గంగలకుర్రు అగ్రహారానికి చెందిన విత్తనాల వెంకట కృష్ణ రూ.10,100 అందజేశారు. ఈ సొమ్మును శుక్రవారం ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావుకు అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

వ్యవసాయ పద్ధతులపై అవగాహన

రాజోలు: మంచి వ్యవసాయ పద్ధతులపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. తాటిపాకలోని రైతు గుబ్బల దుర్గాప్రసాద్ పొలం వద్ద పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. విత్తనం నుంచి విత్తనం వరకు వ్యవసాయ సాగులో వివిధ దశలు, విత్తనశుద్ధి, విత్తనం ఎంపిక చేసుకోవడం వంటి అంశాలను మండల వ్యవసాయాధికారి వై.మధుకుమార్ వివరించారు. సంప్రదాయ పద్ధతులు, ఆధునిక పద్ధతులను గుర్తించేందుకు పొలాల్లో రిబ్బన్లతో గుర్తులు పెట్టి రైతులకు అవగాహన కల్పించారు. రైతులు ప్రత్యక్షంగా పొలాల్లో సాగు పద్ధతులు చూసి నేర్చుకోవడం ద్వారా రైతులకు కొత్త సాంకేతిక పద్ధతులను అలవాటు చేసుకునేందుకు వీలు కలుగుతుందని ఏఓ వివరించారు. తాటిపాక గ్రామ వ్యవసాయాధికారి అబ్బాస్, రైతులు గుడాల నాగరాజు, దేవళ్ల మాణిక్యాలరావు, కడలి నరసింహారావు, పోతుల ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

కొత్తపేట: ఆత్రేయపురం మండలం ర్యాలిలో ప్రభుత్వ పాఠశాలల బాలలకు అనూస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యా సామగ్రి పంపిణీ చేశారు. అను విద్యా బ్యాంక్‌కు స్థానికులు అన్నపూర్ణ, శేఖర్, జె.రవిశేఖర్, సతీష్ సమకూర్చిన పలకలు, పుస్తకాలు, పెన్నులు, స్టేషనరీ సహా విద్యా సామగ్రిని చిన్నారులకు సంస్థ నిర్వాహకులు డాక్టర్ మోహిత్, సీత అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు చింతా శ్యామ్‌కుమార్, రామలక్ష్మి, స్వాతి, సుధాకర్, సూరిబాబు పాల్గొన్నారు.

రహదారి నిబంధనలు పాటించాలి

ఆలమూరు: వాహనదారులు సక్రమంగా రహదారి నిబంధనలు పాటించకపోవడం వల్లే ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఆలమూరు ఎస్సై జి.నరేష్ తెలిపారు. ఇటీవల 216 ఏ జాతీయ రహదారిలో జొన్నాడ నుంచి మడికి వరకూ అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానిక పోలీసులు గుర్తించారు. దీనిపై ఎస్సై నరేష్ నేతృత్వంలోని సిబ్బంది జొన్నాడ బస్టాండు సెంటర్‌లో శుక్రవారం వాహనదారులకు అవగాహన కల్పించారు. రహదారులపై ప్రమాదకరమైన వ్యతిరేక దిశ ప్రయాణం నేరమని వ్యాఖ్యానించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వాహన యజమానితో పాటు మైనర్ల కుటుంబ సభ్యులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాలకు సంబంధించిన పత్రాలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ దగ్గర ఉండాలని అన్నారు. అనంతరం రహదారిపై వెళుతున్న వాహనాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. రికార్డులు సక్రమంగా లేని వాహనాలకు అపరాధ రుసుం విధించారు.

తాతారావుకు భీమ్‌రత్న అవార్డు ప్రదానం



భీమ్‌రత్న అవార్డుతో తాతారావును సన్మానిస్తున్న వేదిక ప్రతినిధులు

మామిడికుదురు: నగరం గ్రామానికి చెందిన అంబేడ్కర్ వాది జాలెం తాతరావుకు భీమ్‌రత్న అవార్డును ప్రదానం చేశారు. దళిత చైతన్య వేదిక ఆధ్వర్యంలో నగరంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఈ అవార్డు ఇచ్చారు. మహనీయుడు తాతరావుకు భీమ్‌రత్న అవార్డు అందించడం ఎంతో ఆనందంగా ఉందని వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బత్తుల మురళీకృష్ణ పేర్కొన్నారు. మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ జాలెం రమణకుమారి, రాజోలు వైస్ ఎంపీపీ పాలమూరి శ్యాంబాబు, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షులు నెల్లి దుర్గాప్రసాద్, వేదిక ప్రతినిధులు చిలకపాటి శ్రీధర్, మట్టా సురేష్, జాలెం సుబ్బారావు, ముకరం హుస్సేన్, కలిగితి పళ్లంరాజు, గెద్దం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మళ్లీ పెరుగుతున్న వరద



పి.గన్నవరం అక్విడెక్టు వద్ద వరద ఉధృతి



అప్పనపల్లి స్నానాలరేవులో పరవళ్లు తొక్కుతున్న గోదావరి

- వరద గుప్పెట్లో లంక గ్రామాలు
- పంటలు కుళ్లిపోతాయని ఆందోళన

పి.గన్నవరం: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో ఈ ఏడాది మూడోసారి వరద పోటెత్తింది. దీంతో జిల్లాలోని వశిష్ట, వైనతేయ, గౌతమీ నదీపాయల్లో మళ్లీ వరద పెరుగుతోంది. లంక గ్రామాలను వరద చుట్టుముడుతోంది. ఈ నేపథ్యంలో పి.గన్నవరం మండలం చాకలిపాలెం శివారు పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన కనకాయలంక కాజ్‌వే శుక్రవారం ఉదయం వరదనీట మునిగింది. అక్కడ వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో అధికారులు పడవలు ఏర్పాటు చేశారు. దీంతో ఆ గ్రామ ప్రజలు పడవలపై ప్రయాణించి పి.గన్నవరం మండలానికి వస్తున్నారు.

ఆందోళనలో లంక గ్రామాల ప్రజలు..

మళ్లీ పెరుగుతున్న వరదతో లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే మండలంలోని ఊడుమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోవడంతో ఆగ్రామాల ప్రజలు పడవలపై ప్రయాణిస్తున్నారు. అలాగే కోనసీమ జిల్లాకు సరిహద్దులో ఉన్న పెదమల్లంక, ఆనగర్లంక, సిర్రావారిలంక, అయోధ్యలంక గ్రామాల ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. తగ్గినట్టే తగ్గి మళ్లీ వరద పెరుగుతుండటంతో లంక గ్రామాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే లంకల్లోని పంటలు పాడైపోయి రైతులు నష్టపోయారు. మళ్లీ వరదలు వస్తే మిగిలిన పంటలు కుళ్లిపోతాయని ఆందోళన చెందుతున్నారు. పశువులను ఏటిగట్లపైకి తరలిస్తున్నారు. పి.గన్నవరం అక్విడెక్టు వద్ద వరద ప్రవాహం ఉధృతంగా ఉంది.

గోదావరి వరద కలవరం

మామిడికుదురు: గోదావరి వరద క్రమేపీ పెరుగుతోంది. దీంతో వైనతేయ గోదావరి నదీతీరంలోని గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వరద తగ్గినట్టే తగ్గి మళ్లీ పెరుగుతూ ఉండడంతో పెదపట్నం, అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం, పాశర్లపూడి, పాశర్లపూడిలంక గ్రామాల ప్రజల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటికే పెదపట్నం మధ్యలంక నుంచి రైతులు అష్టకష్టాలు పడుతూ పడవలపై పశుగ్రాసం తరలించుకుంటున్నారు. వరద మరింత పెరిగే అవకాశం ఉందన్న కేంద్ర జల సంఘం హెచ్చరికలు లంక గ్రామాల ప్రజల్ని ఆందోళనకు గురి చేస్తున్నాయి.

నెలాఖరులోగా బూత్ కమిటీలను నియమించాలి



పి.గన్నవరంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు

పి.గన్నవరం: ఈ నెలాఖరులోగా నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ బూత్‌లకు పార్టీ కన్వీనర్లను నియమించాలని వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు పార్టీ శ్రేణులకు సూచించారు. శుక్రవారం పి.గన్నవరంలోని పార్టీ కార్యాలయం వద్ద మండలశాఖ అధ్యక్షుడు యన్నాబత్తుల ఆనంద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గన్నవరపు మాట్లాడారు. నియోజకవర్గంలో 212 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని వివరించారు. సమర్థులైన వారిని నియమించేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని అన్నారు. దీనిపై పార్టీ నాయకులకు, కార్యకర్తలకు గన్నవరపు పలు సూచనలిచ్చారు. జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని అన్నారు. ప్రజా సమస్యలపై పోరాడుతూ, కూటమి ప్రభుత్వ అరాచకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. సమావేశంలో పార్టీ నాయకులు దొమ్మేటి వెంకట శివరామన్, కొల్లే సూర్యనారాయణ, పుచ్చకాయల నర్సింహమూర్తి, గ్రంధి రామకృష్ణ, యాండ్ర నాగేశ్వరరావు, చింతా రవి, నాగార్జున, వల్లూరి సత్యనారాయణ, యల్లమెల్లి సత్యనారాయణ, కొల్లే శ్రీను, కర్రి సుబ్రహ్మణ్యం, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యానికి ఆర్థిక సాయం



సాయం అందజేస్తున్న సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన బాధితురాలికి ఆర్థిక స్థోమత లేక ఇబ్బందిపడుతుండటంతో స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు వైద్యం నిమిత్తం రూ. 12,500 సాయం అందజేశారు. గ్రామానికి చెందిన కట్రేనపల్లి చంటి వయస్సు 58 సంవత్సరాలు ఈమెకు కాలుకి ఇన్ఫెక్షన్ రావడంతో వైద్యులు శస్త్రచికిత్స చేశారు. ప్రస్తుతం తణుకు లో ఒక హాస్పిటల్ లో ఉన్నారు. స్థానిక కాలువ గట్టున ఒక చిన్న హోటల్ నడుపుకుంటూ జీవనం సాగించే చంటికి భర్త, పిల్లలు ఎవరూ లేరు. హాస్పిటల్ బిల్లు కట్టడానికి డబ్బులు లేక శ్రీ కాశీ అన్నపూర్ణా దేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. రావులపాలెం లో చంటి చెల్లెలి కూతురు టేకి మాధురి కి సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ. 12,500 చెక్కును శుక్రవారం సాయంగా అందజేశారు.

‘గురుకులం’లో సమస్యల పరిష్కారానికి చర్యలు



విద్యార్థులతో కలసి యోగా చేస్తున్న ఆర్డీఓ శ్రీకర్, తహసీల్దార్ శ్రీపల్లవి

పి.గన్నవరం: నరేంద్రపురం గురుకుల పాఠశాలలో సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు కొత్తపేట ఆర్డీఓ పి.శ్రీకర్ తెలిపారు. శుక్రవారం ఆయన పి.గన్నవరం తహసీల్దార్ పి.శ్రీపల్లవితో కలసి గురుకుల పాఠశాలను పరిశీలించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలు తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణను మెరక చేయడంతో పాటు, డ్రైనేజీ నిర్మించాలని, ప్రహరీ ఎత్తు చేయాలని, కిటికీలకు దోమల తెరలు ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరారు. వీటికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆర్డీఓ సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలసి ఆర్డీఓ యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎంపీడీఓ ఉమా మహేశ్వరరావు, ఇరిగేషన్ డీఈ ప్రసాద్, ఆర్ఐ వెన్నపు దాంగే, వీఆర్వోలు సత్య, రమేష్ ఉన్నారు.

విఘ్నేశ్వరస్వామి సన్నిధిలో జిల్లా ఎస్పీ



స్వామివారి సన్నిధిలో జిల్లా ఎస్పీ కృష్ణారావు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామిని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావు, ఆలయ అసిస్టెంట్ కమిషనర్, ఈఓ అల్లు వెంకట దుర్గాభవాని ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామికి విశేష పూజలు జరిపారు. ఆలయ వేదపండితులు ఎస్పీ కృష్ణారావును వేదమంత్రాలతో సత్కరించి స్వామి శేషవస్త్రాలు అందజేశారు. స్వామి చిత్రపటం ప్రసాదం అందజేశారు.

ఐదున్నర కిలోల లడ్డూ రూ.39,116



నగరంలో వేలంలో దక్కించుకున్న లడ్డూతో యువకులు

మామిడికుదురు: గణపతి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా నగరం మల్లాయిపాలెంలో బాల గణపతి స్వామి మండపం వద్ద శుక్రవారం అన్న సమారాధన జరిగింది. అనంతరం వినాయకుని చేతిలో పెట్టిన ఐదున్నర కిలోల లడ్డూ ప్రసాదాన్ని వేలం వేశారు. అదే గ్రామానికి చెందిన మోనిక ఆర్కే అనే భక్తురాలు ఆ లడ్డూను రూ.39,116కు దక్కించుకున్నారు. ఆ లడ్డూను ఊరేగింపుగా తీసుకు వెళ్లి భక్తులకు ప్రసాదంగా పంచారు.

పిచ్చికుక్క స్వైర విహారం

పి.గన్నవరం: గ్రామంలో శుక్రవారం ఓ పిచ్చి కుక్క స్వైర విహారం చేసింది. మొత్తం ఆరుగురిని కరవడంతో వారు గాయాల పాలయ్యారు. స్థానిక సీహెచ్‌సీలో నలుగురు బాధితులు చికిత్స చేయించుకుని ఇళ్లకు వెళ్లారు. ఇద్దరికి ఎక్కువగా గాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆరుగురిని కరిచిన పిచ్చికుక్కను పట్టుకునేందుకు స్థానికులు, వ్యాపారులు ప్రయత్నించగా పారిపోయింది. ఈ నేపథ్యంలో గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని వ్యాపారులు విజ్ఞప్తి చేశారు.

ఘనంగా క్రీడా దినోత్సవం



అంబాజీపేటలో విశ్రాంత పీఈటీ గోపాలకృష్ణను సత్కరిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు



శివకోటిలో పతకాలు పొందిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

అంబాజీపేట: చదువులతో పాటు క్రీడల్లో రాణిస్తే విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉంటోందని రిటైర్డ్ వ్యాయామోపాధ్యాయుడు బొక్కా గోపాలకృష్ణ అన్నారు. అంబాజీపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవం జరిగాయి. పాఠశాల గెజిటెడ్ హెచ్ఎం కె.సాయిరామ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాలకు గోపాలకృష్ణ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఆగస్టు 29వ తేదీ భారత రత్న, హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ పుట్టినరోజు, ఏటా క్రీడా దినోత్సవం నిర్వహిస్తారని గోపాలకృష్ణ తెలిపారు. క్రీడా దినోత్సవం సందర్భంగా సీనియర్ వ్యాయామోపాధ్యాయుడు గోపాలకృష్ణ ఘనంగా సత్కరించారు. ఆయన గతంలో ఈ పాఠశాలలో పీఈటీగా క్రీడాభివృద్ధికి విశేష సేవలందించారని పీడీ కె.ఆదిలక్ష్మి, పీఈటీ ఎ.ఉమా మహేశ్వరరావు తెలిపారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి మెడల్స్, సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు బీఎస్ఎన్ మూర్తి, ఫణికుమార్, ఎ.సూర్యకుమారి పాల్గొన్నారు.

కొత్తపేట: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు అన్నారు. భారత హాకీ క్రాడాకారుడు, ఒలింపిక్ లెజెండ్ మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి, జాతీయ క్రీడా దినోత్సవాన్ని కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌చార్జ అంకమరావు తదితరులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లి: అంతర్వేదికర ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల అలంకరించి నివాళులు అర్పించారు. ప్రధానోపాధ్యాయిని నారిన ఛాయాప్రసూనాంబ తెలుగు భాష ఉపాధ్యాయులు ఎస్‌కే మహీబుల్లా షరీఫ్, పీడీ కె.భాస్కరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మేజర్ ధ్యాన్‌చంద్, గిడుగు రామ్మూర్తి పంతులు సేవలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

రాజోలు: జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని శివకోటి ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు పలు క్రీడలపై పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు స్కూల్ యాజమాన్య కమిటీ చైర్మన్ అప్పారి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు ఎన్.శ్రీనివాస్ పతకాలు అందజేశారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. క్రీడాపోటీలు నిర్వహించిన వ్యాయామోపాధ్యాయుడు చొప్పల చంద్రశేఖర్‌ను విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

అయినవిల్లి: నేదునూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని హెచ్ఎం పీఎస్‌వీవీ ప్రసాదరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. పాఠశాలకు నీటి సంఘం అధ్యక్షుడు చింతపల్లి సత్యనారాయణ విద్యార్థులకు రూ.14 వేలు విలువైన 40 జతల క్రీడా దుస్తులను అందజేశారు. ఎంపీటీసీ సభ్యుడు కోళ్ళపల్లి వెంకట సుబ్బరాజు రూ.35 వేలతో క్రీడా సామగ్రి సమకూర్చారు. మరో ఎంపీటీసీ సభ్యుడు ఇందుగుల వెంకట్రామయ్య స్టేజ్ మీదకు రూ.5 వేలు విలువైన పంకా బహూకరించారు. దాతలను స్కూల్ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. సర్పంచ్ గుమ్మడి ప్రసాద్ రూ.4 వేలతో వైరింగ్ చేయించారు. కార్యక్రమంలో పసుపులేటి చంటి, బండి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

మూషిక వాహనంపై ఊరేగిన గణపయ్య



అయినవిల్లి విఘ్నేశ్వరుడిని మాడవీధుల్లో ఊరేగిస్తున్న ఆలయ సిబ్బంది



కుచిపూడి నృత్యాన్ని ప్రదర్శిస్తున్న ముక్తేశ్వరం కోనసీమ విద్యాశ్రమ్ పాఠశాల విద్యార్థులు

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారిని చవితి ఉత్సవాల్లో భాగంగా మూషిక వాహనంపై విద్యాగణపతి అలంకరణలో మాడవీధుల్లో శుక్రవారం ఊరేగించారు. ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావు ఆధ్వర్యంలో స్వామికి తెల్లవారుజాము నుంచి విశేష పూజలు జరిపారు. స్వామికి పంచామృతాభిషేకం, లఘున్యాస, ఏకదశ రుద్రాభిషేకాలు, లక్ష గరిక పూజ, లక్ష్మీగణపతిహోమం జరిపారు. సాయంత్రం స్వామికి పంచాహారతులు ఇచ్చారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయ కమిషనర్, ఈఓ అల్లు వెంకట దుర్గాభవాని పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలను నిర్వహించారు.

అలరించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు

గణపతి నవరాత్రుల్లో భాగంగా అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయం వద్ద ఏర్పాటు చేసి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ముక్తేశ్వరం కోనసీమ విద్యాశ్రమ్ పాఠశాల ఆధ్వర్యంలో ఆ పాఠశాల డైరెక్టర్ సీహెచ్‌వీవీ ప్రసాద్, ప్రిన్సిపల్ బీనాజాస్ పర్యవేక్షణలో ఆ విద్యార్థులతో కుచిపూడి నృత్యప్రదర్శన ఏర్పాటు చేశారు. కాకినాడకు చెందిన ఆర్.మాణిక్య కల్లవల్లి అన్నమాచార్య లలిత సంగీత క్లాసికల్ కార్యక్రమం, వైష్ణవి కూచిపూడి నృత్యం, విజయవాడ నటరాజ నృత్యాలయం వారి నృత్య ప్రదర్శన, రావులపాలెం ఎం.సిద్ధయ్య బుర్రకథ మొదలైనవి భక్తులను అకట్టుకున్నాయి. ముక్తేశ్వరం కోనసీమ విద్యార్థులను ఆలయ ఈఓ అల్లు వెంకటదుర్గాభవాని సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

ఎవరి పింఛన్లూ తొలగించలేదు

సాక్షి ఇంపాక్ట్

అంబాజీపేట: మండలంలో రీ వెరిఫికేషన్ పేరుతో మండలంలో కొంత మంది పింఛన్లు తీసేశారంటూ నోటీసులు ఇచ్చిన వారందరికి యథావిధిగా పింఛన్లు ఇవ్వనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ ఏపీఎల్.నరసింహం తెలిపారు. ‘సాక్షి’ దినపత్రికలో ఈ నెల 25న ‘అర్హతలున్నా పింఛన్లు పీకేశారు’ అనే వార్తా కథనం వెలువడింది. దాంతో అధికారులు స్పందించారు. వివిధ కారణాలు చూపుతూ మండలంలో 102 మంది పింఛన్‌దారులకు యథావిధిగా సెప్టెంబర్ 1న పింఛన్లు ఇస్తామన్నారు.

గణేశ్ నిమజ్జన ఉత్సవాలకు క్రేన్ల ఏర్పాటు



జిల్లా కలెక్టర్‌కు నిమజ్జన ఆహ్వాన పత్రం అందిస్తున్న కమిటీ సభ్యులు

రాజోలు: వినాయక భారీ విగ్రహాలను గోదావరిలో నిమజ్జనం చేసేందుకు క్రేన్ల సదుపాయం కల్పిస్తామని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ హామీ ఇచ్చారని రాజోలు తాలూకా నిమజ్జన కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్‌ను కలసి రాజోలులో జరిగే నిమజ్జన మహోత్సవానికి రావాలని ఆహ్వానపత్రాన్ని అందజేశారు. వచ్చే నెల 9వ తేదీన రాజోలు వశిష్టానదీ తీరంలో అంగరంగ వైభవంగా నిమజ్జనోత్సవం జరుగుతుందని కలెక్టర్‌కు వివరించారు. రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల పరిధిలోని సుమారు 150కి పైగా వినాయక విగ్రహాలు ఆ రోజు ఊరేగింపుగా రాజోలు చేరుకుంటాయన్నారు. గత 34 ఏళ్లుగా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. నిమజ్జన ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రక్షణ చర్యల కోసం రెవెన్యూ, పోలీస్ యంత్రాంగాలను సమయాత్తం చేయాలని కమిటీ సభ్యులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. కమిటీ గౌరవ అధ్యక్షుడు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం, అధ్యక్షుడు కాసు శ్రీనివాస్, కార్యదర్శి పట్నాల దత్తాత్రేయ, రాజా నాగరత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాల్‌కంబ్ క్రీడలో పాల్గొన్న యువకులు



మాల్‌కంబ్ క్రీడల్లో పోటీ పడుతున్న యువకులు

మామిడికుదురు: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఆదుర్రు సెంటర్లో వరసిద్ధి వినాయకస్వామి వారి 15వ నవరాత్ర మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా గురువారం రాత్రి ఏర్పాటు చేసిన మాల్‌కంబ్ క్రీడల్లో యువకులు ఎంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా పాల్గొన్నారు. దూది చెట్టును కొట్టుకు వచ్చి దానికి ఆముదం రాసి ఆ చెట్టు చివర్లో కొంత నగదును ఏర్పాటు చేసి దాన్ని భూమిలో పాతారు. ఆ రాటను ఎక్కి దాని చివర్లో పెట్టిన బహుమతిని దక్కించుకునేందుకు యువకులు ఎంతో సాహసం చేశారు. విజిల్స్ వేస్తూ భక్తులు రాట ఎక్కేందుకు ప్రయత్నించిన యువకులను ఉత్సాహ పర్చారు. ఈ కార్యక్రమం ఆద్యంతం ఎంతో కన్నుల పండుగలా జరిగింది. అతి కష్టం మీద ఆ రాడు ఎక్కి దాని చివర భాగంలో ఏర్పాటు చేసిన బహుమతిని యువకులు దక్కించుకున్నారు.

పంట స్వభావం బట్టి ఎరువులు వినియోగించాలి

అంబాజీపేట: ఎరువుల యాజమాన్యంలో భాగంగా పంట, నేల స్వభావాన్ని బట్టి ఎరువులు వినియోగించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వనరుల కేంద్ర సహాయ వ్యవసాయ సంచాలకుడు ఏవీఎస్ రాజశేఖర్ అన్నారు. పసుపల్లిలో సర్పంచ్ మట్టపర్తి నాగరాజు అధ్యక్షతన ప్రధాన మంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన ఖరీఫ్ పంటలో చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. రాజశేఖర్ మాట్లాడుతూ అధిక మోతాదులో యూరియా వాడటం వలన పురుగులు, తెగుళ్ల ఉధృతి పెరుగుతుందన్నారు. వరి నాటిన 20 రోజుల తరువాత కాంప్లెక్స్ ఎరువులు వినియోగించకూడదన్నారు. ఖరీఫ్ పంటలో సమగ్ర ఎరువులు యాజమాన్యం, సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఓ కె.ధర్మప్రసాద్, డీఆర్‌సీ వ్యవసాయాధికారి జె.మనోహర్, ఏఈఓలు జి.శివమోహన్, జాబేజ్, రైతులు పాల్గొన్నారు.

తెలుగు భాషను పరిరక్షించుకుందాం



రాజోలులో మాట్లాడుతున్న తెలుగు అధ్యాపకురాలు జరీనా బేగం

రాజోలు/అంబాజీపేట/మామిడికుదురు/మలికిపురం/కొత్తపేట: తెలుగు భాషకు ప్రపంచ కీర్తి ఉందని రాజమహేంద్రవరం ప్రభుత్వ కళాశాల అధ్యాపకురాలు షేక్ జెరీనా బేగం అన్నారు. రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం తెలుగుభాషా దినోత్సవం నిర్వహించారు. తెలుగు పండితులు గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల అధ్యాపకులు జరీనా బేగంను ఘనంగా సత్కరించారు. వ్యవహారిక భాషకు ఆద్యుడు గిడుగు రామ్మూర్తి అని హెచ్ఎం అక్కిరాజు శేషసాయి అన్నారు. గంగలకుర్రు జెడ్పీ హైస్కూల్‌లో గిడుగు రామూర్తి జయంతిని నిర్వహించారు. తెలుగు భాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మామిడికుదురు దీప్తి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డీవీవీ సత్యనారాయణ పిలుపునిచ్చారు. మామిడికుదురు దీప్తి స్కూల్ విద్యార్థులు అక్షరాల రూపంలో ఆకట్టుకున్నారు. తెలుగు భాషను పరిరక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ నిబద్ధతతో కృషి చేయాలని మలికిపురం డిగ్రీ కళాశాల కరస్పాండంట్ మంగెన వెంకట సత్యనారాయణ మూర్తి పిలుపునిచ్చారు. ప్రతి ఇంటా తెలుగు వెలుగులు విరబూయాలని కొత్తపేట విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.పెద్దిరాజు అన్నారు. కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కళాశాలల్లో గిడుగు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అవార్డు గ్రహీత ‘ఇస్మాయిల్’కు సత్కారం



ఇస్మాయిల్‌ను సత్కరిస్తున్న శ్రీనివాస్

రాజోలు: మదర్‌థెరిసా జాతీయ అవార్డు గ్రహీత మండల కో–ఆప్షన్ సభ్యుడు షేక్ ఇస్మాయిల్(బజ్జీల సాహెబ్)ను శుక్రవారం సత్కరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కడలి దుర్గాలక్ష్మి ఆధ్వర్యంలో డెల్టా ప్రాజెక్ట్ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ ఆయనను సత్కరించారు. కో–ఆప్షన్ సభ్యుడిగా షేక్ ఇస్మాయిల్ అనేక సమస్యలకు పరిష్కారం లభించేలా కృషి చేశారన్నారు. నాయకులు చాగంటి స్వామి, అడబాల విజయ్, కడలి మోహన్ తదితరులు పాల్గొన్నారు.